

నేడు టెన్త్ పరీక్షా ఫలితాలు

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్

పదవ తరగతి పరీక్షా ఫలితాలు బుధవారం ఉదయం 10 గంటలకు విడుదల కానున్నాయి. ఎస్ఎస్‌సీ పబ్లిక్ పరీక్షల ఫలితాలు, ఓపెన్ స్కూల్ పదో తరగతితోపాటు ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్ ఫలితాలు ఒకేసారి విడుదల చేస్తున్నట్లు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయ రామరాజు తెలిపారు. అభ్యర్థులు ఫలితాలను ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్‌లోనూ, 'మన మిత్ర' వాట్సాప్, లీప్ మొబైల్ యాప్‌లలో అందుబాటులో ఉంటాయని తెలిపారు. తిరుపతి జిల్లాలో 164 పరీక్ష కేంద్రాల్లో 31 సిట్టింగ్, 10 ఫ్లయింగ్ స్క్వాడ్,164మంది చీఫ్ సూపరింటెండెంట్ లు,1526 మంది ఇన్విజిలేటర్ ల పర్యవేక్షణలో 26 వేల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు.విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలతో పరీక్షలు నిర్వహించామని, ఫలితాలు కూడా ఆశాజనకంగానే ఉంటాయని జిల్లా విద్యాశాఖ అధికారి కె వి ఎన్ కుమార్ పేర్కొన్నారు.

20న జాతీయ సమ్మెను జయప్రదం చేయండి : సిఐటియు

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్



కార్మిక చట్టాలపై మాట్లాడుతున్న కందారపు మురళి

మే 20న జరగనున్న జాతీయ సమ్మెను కార్మిక సంఘాలు జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, జిల్లా ఉపాధ్యక్షులు వందవాసి నాగరాజు పిలుపునిచ్చారు. మంగళవారం సిఐటియు వెంకటగిరి మండల విస్తృతస్థాయి సమావేశం యుటిఎఫ్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడతూ కార్మికవర్గం నేడు అనుభవిస్తున్న చట్టాలన్నీ బ్రిటీష్ కాలం నుంచి కార్మికులు పోరాడి సాధించుకున్నవేనని అన్నారు. కార్మిక హక్కులను కాలరాయడానికి, రక్షణ లేకుండా చేయడానికి, కార్మికవర్గాన్ని అణచివేయడానికి, దోపిడీని తీవ్రతరం చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఈ లేబర్‌కోడ్స్‌ను తీసుకొస్తుందన్నారు. కోవిడ్ సమయంలో ప్రజలంతా ప్రాణాలను అరచేతిలో పెట్టుకున్నపుడు అకస్మాత్తుగా ఈ కోడ్స్‌ను బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. ఈ బిల్లుకు కాంగ్రెస్, టిడిపి, వైసిపిలు పూర్తి మద్దతు ఇచ్చాయన్నారు. పార్లమెంట్‌లో వామపక్షాలు, డిఎంకె మాత్రమే వ్యతిరేకరించాయన్నారు. పోరాడి సాధించుకున్న ఈ చట్టాలన్నింటినీ బిజెపి ప్రభుత్వం ఒక్క కలం పోటుతో నిర్వీర్యం చేస్తోందన్నారు. కార్మికవర్గానికి ఉపయోగపడే ఈ చట్టాలను కాపాడుకోవడం కోసం 20న జరుగు సమ్మెలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు వడ్డిపల్లి చెంగయ్య, ఆశ వర్కర్స్ యూనియన్ తిరుపతి జిల్లా అధ్యక్షులు కవిత, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు ఎన్.స్వరూపరాణి, ఎ.మంజుల, సుభాషిణి, నిర్మల, సిఐటియు నాయకులు పెంచలయ్య, సుగుణ, స్వప్న, సుబ్రమణ్యం, రాజయ్య, రామయ్య, నారాయణ, గొట్టిపాడు శాఖ కార్యదర్శి రాజగోపాల్ పాల్గొన్నారు.

రేపటి నుంచే 'వేసవి' సెలవులు

జూన్ 12న మళ్లీ ప్రారంభం

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్



ఇన్నాళ్లు వార్షిక పరీక్షలతో హడలెత్తిపోయిన విద్యార్థులకు రేపటి నుంచి ఊరట లభించనుంది. ఎప్పుడెప్పుడా అని పిల్లలు ఎదురుచూసే వేసవి సెలవులు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. మొత్తం 48 రోజుల పాటు వేసవి సెలవులు ఉంటాయనీ అధికారిక ప్రకటనా వెలువడింది. ఈ నేపథ్యంలో బుధవారంతో ఈ విద్యా సంవత్సర చివరి పని దినం ముగియనుంది. ఏప్రిల్ 24వ తేదీ నుంచి జూన్ 11వ తేదీ వరకు అన్ని పాఠశాలలకూ సెలవులు ప్రకటించారు. జూన్ 12న తిరిగి ప్రారంభం కానున్నాయి.

జాతీయ రహదారుల నిర్మాణం త్వరితగతిన పూర్తవ్వాలి : కలెక్టర్


ప్రజాశక్తి - తిరుపతి టౌన్



జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్ట్ పనులు సంబంధించిన పలు భూ సంబంధిత పెండింగ్ నిర్మాణ పనులను ప్రణాళిక భద్ధంగా వేగవంతంగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని సమావేశ మందిరంలోజాతీయ రహదారులకు, రైల్వే ప్రాజెక్ట్ పనులు సంబంధించిన పలు భూ సంబంధిత పెండింగ్ అంశాలు, నిర్మాణ పురోగతి పనులపై జిల్లా కలెక్టర్ వర్చువల్ విధానంలో నేషనల్ హైవే పి డి లు, గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, సూళ్లూరుపేట , శ్రీకాళహస్తి ఆర్డీఓలు, కిరణ్మయి, భానుప్రకాష్ రెడ్డి సంబంధిత మండలాల తాసిల్దార్లు, సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. పురోగతిలో ఉన్న రేణిగుంట ,పూడి, గూడూరు, రేణిగుంట, పాకాల, తిరుపతి టౌన్ సంబంధించిన రైల్వే ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలన్నారు. నడికుడి శ్రీకాళహస్తి రైల్వే ప్రాజెక్టు పనుల కు సంబంధించి భూసేకరణ పనులు పూర్తయ్యాయని తెలిపారు. ఆరు లైన్లు రహదారులు నిర్మాణం, తిరుపతి బైపాస్ వేగవంతం చేయాలని, రేణిగుంట నుండి చెన్నై వరకు 4 లేన్ల రహదారుల పనులు పూర్తి చేయాలని భూ సేకరణకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. ప్యాకేజీ 2,3,4 జాతీయ రహదారి పనులు సాగరమాల కింద చేపట్టిన వాటిని పెండింగ్ లేకుండా రెవెన్యూ డివిజనల్ అధికారులు నేషనల్ హైవే అధికారులతో సమన్వయంతో చేసుకొని నాణ్యత తో పనులు పూర్తి కావాలని అన్నారు. రేణిగుంట, తిరుచానూరు రైల్వే లైన్ లో భాగంగా భూ సేకరణకు సంబంధించిన పనులును సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే తిరుపతి రేణిగుంట బైపాస్ సంబంధించిన పెండింగ్ భూ సమస్యలను పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ లను ఆదేశించారు.ఈ సమావేశంలో నేషనల్ హైవే పి డి లు తిరుపతి వెంకటేష్,నెల్లూరు ఎంకే చౌదరి, డెప్యూటీ తాసిల్దార్ భాస్కర్ పాల్గొన్నారు.

'యూపీఎస్సీ' ఫలితాల్లో మెరిసిన శ్రీకాంత్

ప్రజాశక్తి - క్యాంపస్



యుపిఎస్‌సి సివిల్ సర్వీసెస్ పరీక్షా ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. ఆలిండియా ర్యాంక్ 904 చిత్తూరు జిల్లా పలమనేరు వాసి శ్రీరంపం శ్రీకాంత్ సాధించారు. రంపం శ్రీకాంత్పాఠశాల విద్యాభ్యాసం పలమనేరులోనూ, ఇంజినీరింగ్ గ్రాడ్యుయేషన్ హైదరాబాద్‌లోనూ, ఎంబిఎ, ఐఐఎం బెంగుళూరులోనూ చేశారు. ప్రముఖ సంస్థలైన గూగుల్, అమెజాన్లో డిజిటల్ మార్కెటింగ్ మేనేజర్గా పనిచేస్తు, క్రమశిక్షణ పట్టుదలతో శిక్షణ లేకుండానే - స్వంత ప్రణాళికలతో నిర్విరామంగా కషి చేసి 2025 యుపిఎస్సీ సివిల్ సర్వీసెస్ లో ఉన్నతమైన ర్యాంకు సాధించినందుకు గాను తల్లి తండ్రులు రేణుక, నాగరాజు(రిటైర్డ్ టీచర్), అత్తమామలు జ్యోత్స్న, చంద్రబాబులకు, తన వెన్నంటి నిలిచిన సతీమణి శ్రావ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

'డిక్సన్' కంపెనీ బస్సు బోల్తా

46 మందికి ఉద్యోగులకు 'అమర'లో చికిత్స

క్షతగాత్రులను పరామర్శించిన సిఐటియు నేతలు

ప్రజాశక్తి - రేణిగుంట

తెలతెలవారక ముందే ఇంట్లో పనులన్నీ ముగించుకుని షిఫ్ట్ డ్యూటీకి కంపెనీ బస్సులో బయల్దేరిన ఉద్యోగులు రోడ్డు ప్రమాదంతో దిగ్భ్రాంతికి గురయ్యారు. ఒక్క నిమిషం ఏం జరిగిందో తెలియక బిత్తరపోయారు. నాయుడుపేట - పూతలపట్టు జాతీయ రహదారిలోని రేణిగుంట మండలం మర్రిగుంట సర్కిల్ వద్ద ట్రాక్టర్‌ను తప్పించబోయి డిక్సన్ కంపెనీ బస్సు ఉదయం 7.55 గంటలకు బోల్తా పడింది. ఈ ఘటనలో ఉదయం షిఫ్ట్‌కు బయల్దేరి వెళుతున్న 46 మంది ఉద్యోగులు ఉన్నారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. గాయపడిన వారిని బాలాజీ, అమర ఆస్పత్రులకు రేణిగుంట అర్బన్ పోలీసులు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఘటన వివరాలిలా ఉన్నాయి.

ఉద్యోగులకు మెరుగైన వైద్యం అందించాలి : సిఐటియు

'ఫాక్స్ లింక్ కంపెనీ' (డిక్సన్) బస్సు యాక్సిడెంట్‌లో తీవ్ర



గాయాలైన మహిళా కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలని సిఐటియు మండల కార్యదర్శి కొండ్రెడ్డి హరినాథ్ డిమాండ్ చేశారు. ఘటనా స్థలాన్ని మండల అధ్యక్షులు సెల్వరాజ్, ఏర్పేడు మండల కార్యదర్శి కరీముల్లాతో కలిసి పరిశీలించారు. గాయపడిన మహిళా ఉద్యోగులను పరామర్శించారు. కంపెనీ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా తీవ్రంగా గాయపడిన వారిని 108 ద్వారా కరకంబాడి రోడ్డులోని అమరా ఆస్పత్రికి తరలించారని తెలిపారు. 46 మందిలో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయని తెలిపారు. నలుగురు తీవ్రంగా గాయపడి ఆపరేషన్ థియేటర్‌లో చికిత్స పొందుతున్నారని అమరా ఆస్పత్రి వైద్యులు తెలిపారన్నారు.

'అమరా'లో సకాలంలో వైద్యసేవలు

అమరా ట్రామా సిస్టమ్ బృందం అంబులెన్స్ ద్వారా సైట్ నుంచి తక్షణ సంరక్షణ అవసరమయ్యే బాధితులకు వేగవంతమైన చికిత్స, సురక్షిత రవాణాలో కీలక పాత్ర పోషించింది. 5-10 మంది తీవ్రంగా గాయపడ్డారని, 35 మంది స్థిరంగా అబ్జర్వేషన్‌లో ఉన్నారని, నలుగురు ఆపరేషన్ థియేటర్‌లో ఉన్నారని ఆస్పత్రి ఛైర్మన్ గౌరినేని ప్రసాద్, మేనేజింగ్ డైరెక్టర్ గౌరినేని రమాదేవి పేర్కొన్నారు. అమర ఆస్పత్రి, అమరరాజా సంస్థ, ఫాక్స్‌లింక్, సన్నీ ఒపోటెక్ నుంచి దాదాపు 30 మంది వాలంటీర్లు రక్తదానం చేశారన్నారు.

డ్రోన్ కెమెరాలతో అర్ధరాత్రుల్లో నిఘా

వెంటాడి వేటాడి శిక్షించనున్న పోలీసులు

ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు వినూత్న ప్రయోగం

ప్రజాశక్తి - తిరుపతి సిటి

జిల్లా వ్యాప్తంగా అల్లరిమూకల ఆట కట్టించేందుకు ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. ఏపిలో మొట్టమొదటి సారిగా అర్ధరాత్రి సమయంలో మాట్రిక్ 4 థర్మల్ డ్రోన్ కెమెరాను ఉపయోగించి గంజాయి, గాంబ్లింగ్, బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తున్నవారి ఆట కట్టిస్తున్నారు. పగటిపూట గుట్టుచప్పుడు కాకుండా రహస్య ప్రాంతాల్లో గంజాయి గాంబ్లింగ్, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న వారిని డ్రోన్ కెమెరాలతో పసిగట్టి జిల్లా వ్యాప్తంగా పోలీసు సిబ్బంది కేసు నమోదు చేస్తున్నారు. దీంతో పగలు అల్లరి మూక సైలెంట్ అయి, రాత్రి సమయాల్లో గంజాయి, గాంబ్లింగ్, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే విధంగా పంథా మార్చుకున్నారు. అలాంటి వారిని ఆటకట్టించేందుకు తాజాగా అధునాతన సాంకేతిక టెక్నాలజీ కలిగిన మాట్రిక్ 4 థర్మల్ అనే డ్రోన్ కెమెరాను జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఐపీఎస్ఉపయోగించి అల్లరి మూకలను పరుగుపట్టిస్తున్నారు.నగర శివారు ప్రాంతంలో రహస్యంగా పది మంది ఒక చోట కూర్చుని మద్యం, గంజాయి సేవిస్తూ మాట్రిక్ 4 థర్మల్ డ్రోన్ కెమెరా కంట పడ్డారు. పోలీసులు గుర్తించడంతో వారు కంగుతిని పరుగులు తీశారు. దేశ, విదేశాల నుండి తిరుమల తిరుపతి దేవస్థానం దర్శించుకునేందుకు వస్తున్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకే ఈ అధునాతన సాంకేతిక టెక్నాలజీ కలిగిన మాట్రిక్ 4 థర్మల్ డ్రోన్ కెమెరా ఉపయోగిస్తున్నామని ఎస్‌పి తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం, గంజాయి సేవించినా, గాంబ్లింగ్ నిర్వహించినా డ్రోన్ కెమెరా వెంటాడి వేటాడి శిక్షిస్తుందని హెచ్చరించారు.



లెనిన్ ఆశయ సాధనకు నడుం బిగించాలి : సిపిఐ

ప్రజాశక్తి - తిరుపతి సిటి



రష్యన్ విప్లవ సేనాని, సమ సమాజ నిర్మాత లెనిన్ ఆశయ సాధనకు యువత పాటుపడాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు హరినాథ రెడ్డి అన్నారు. మంగళవారం తిరుపతి బైరాగిపట్టెడలోని సీపీఐ కార్యాలయం వద్ద లెనిన్ 155వ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భగా హరినాథ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే మార్క్సిజాన్ని ఆధ్యయనం చేసిన లెనిన్ ప్రపంచంలోనే మొట్టమొదటి కమ్యూనిస్టు దేశాన్ని ఏర్పాటు చేశాడని అన్నారు. ప్రజల్లో అంతరాలు లేకుండా సమసమాజాన్ని నిర్మించిన యోధుడు లెనిన్ అని కొనియాడారు. సామ్రాజ్యవాదాన్ని బలంగా వ్యతిరేఖించడమే కాకుండా సామ్రజ్యవాద వ్యతిరేఖ సిద్ధాంతాన్ని రచించి ప్రపంచ కమ్యూనిస్టు సిద్ధాంతాలకు బీజం వేశాడని చెప్పారు. ఆయన స్ఫూర్తితోనే ప్రపంచ వ్యాప్తంగా చాలా కమ్యూనిస్టు ఉద్యమాలు, పోరాటాలు పుట్టుకువచ్చాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పి మురళి, జిల్లా కార్యవర్గ సభ్యులు కే రాధాకష్ణ పాల్గొన్నారు.

'అమరా'లో 'కాంబాట్ సెప్సిస్' కాన్ఫరెన్స్

ప్రజాశక్తి - రేణిగుంట



అమరా ఆస్పత్రిలో 'కాంబాట్ సెప్సిస్' కాన్ఫరెన్స్ విజయవంతంగా మంగళవారం నిర్వహించారు. సెప్సిస్ నిర్వహణలో వైద్యపరమైన నైపుణ్యాన్ని పెంపొందించడం, యాంటీబయాటిక్స్ హేతుబద్ధమైన ఉపయోగం కోసం ఈ కార్యక్రమం లక్ష్యంగా పెట్టుకున్నామని ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ గౌరినేని ప్రసాద్, రమాదేవి పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా విశిష్ట అతిథి డాక్టర్ అల్లాడి మోహన్, డాక్టర్ అలోక ఎస్, డాక్టర్ జె. రాధ, డాక్టర్ మధన్ మోహన్ రెడ్డి, డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ జె ప్రవీణ్, ఇన్‌ఫెక్షన్ డిసీజ్ స్పెషలిస్ట్ డాక్టర్ డి. శ్రీనివాస్‌కర్, డాక్టర్ డి. విజయ్ కుమార్, డాక్టర్ మోనాలిసా సాహు, డాక్టర్ రమాదేవి గౌరినేని ఉత్సవ దీపాలను వెలిగించారు. ఈ కాన్ఫరెన్స్ ఆరోగ్య సంరక్షణలో నిరంతర విద్య యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పింది.

అతిథిగృహం లిఫ్ట్‌లో ఇరుకున్న భక్తులు

ప్రజాశక్తి -తిరుమల తిరుమలలోని గోవింద సాయి అతిథి గృహం లిఫ్ట్ లో మంగళవారం భక్తులు ఇబ్బంది పడ్డారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండటంతో లిఫ్టు ఆగిపోయింది. అర్ధ గంట వరకు భక్తులు ఇబ్బంది పడ్డారు. అనంతరం అతిథి గహ నిర్వాహకులు, టెక్నీషియన్ లిఫ్ట్ మరమ్మతులు చేసి తెరిపించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.ఇందులో ఇద్దరు మహిళలు, ముగ్గురు పిల్లలు ఇరుక్కోవడంతో గంటపాటు ఊపిరాడక ఇబ్బంది పడ్డారు. ఉన్నతాధికారులుకు ఫిర్యాదు చేశారు.

నగరవనంలో అటవీశాఖ క్యాంటీన్ నిర్మాణం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

తిరుపతి నగరవనంలో శ్రీనివాసమంగాపురం ఏకో డెవలప్మెంట్ కమిటీ ఆధ్వర్యంలో సిబ్బంది కోసం క్యాంటీన్ ఏర్పాటు చేయడానికి నిర్మాణ పనులు ప్రారంభించారు. అయితే ఈ క్యాంటీన్ ఏర్పాటు కోసం అటవీశాఖ అధికారులు చెట్లను తొలగించారు. చెట్లు తొలగించడంపై ప్రకతి ప్రేమికులతో పాటు రాజకీయ నాయకులు పెదవి విరుస్తున్నారు. సంరక్షించాల్సిన అధికారులే పచ్చని చెట్లను నేలకూల్చడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. దాదాపు 15 నుంచి 20 ఏళ్ల వయసు కలిగిన చెట్లను నరికి వేయడం పట్ల వైసిపి తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. నగరవనానికి చేరుకుని అటవీశాఖ అధికారుల తీరును తప్పుపట్టారు. ఎన్నో జీవజాలాలకు నగర ప్రజలకు ఆహ్లాదాన్ని అందించే నగరవనంలో చేపట్టిన ఈ ప్రాజెక్టును వెంటనే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. లేని పక్షంలో ప్రకతి ప్రేమికులతో కలిసి ఉద్యమిస్తామన్నారు. దీనిపై అటవీశాఖ రేంజ్ ఆఫీసర్ సుదర్శన్ రెడ్డిని వివరణ కోరగా పోలీసు అధికారులకు, ఉన్నత స్థాయి పరిపాలన అధికారులకు క్యాంటీన్లు ఉన్నట్లుగానే అటవీశాఖ అధికారులకు, సిబ్బందికి ఈ క్యాంటీన్ ను నిర్మించి అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించాం. వెదురు బొంగులతో, పైకప్పు బోధతో దట్టంగా ఉండేలా నిర్మిస్తున్నామన్నారు. ఈ క్యాంటీన్ చుట్టుపక్కల మరింత పచ్చదనాన్ని పెంచడానికి వివిధ జాతులకు చెందిన 200 చెట్లను నాటనున్నామన్నారు. ఈ క్యాంటీన్లో వినియోగించే పాత్రలు కూడా ఎకో ఫ్రెండ్లీగా ఉండేటట్లుగా జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

ఎస్వీయూ కో ఆపరేటివ్ ఉద్యోగులను కొనసాగించండి

ప్రజాశక్తి - క్యాంపస్

ఎస్వీయూ కో ఆపరేటివ్ స్టోర్ లో పనిచేసే ఉద్యోగులను కొనసాగించాలని రాష్ట్ర హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. ఈ మేరకు ఎస్వీయూ కోఆపరేటివ్ స్టోర్స్‌లో పనిచేస్తున్న తాత్కాలిక ఉద్యోగులకు టెర్మినేషన్ ఆర్డర్‌ను రద్దుచేసి తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు వారిని ఉద్యోగంలో కొనసాగించాలని సూచించింది. ఎస్వీయూ కన్స్యూమర్ స్టోర్స్ లో అవినీతి అక్రమాలపై స్టోర్ ఇంచార్జ్ అరుణ ఆధ్వర్యంలో ప్రత్యేకమైన కమిటీ వేసి విచారణ జరిపి రిపోర్టును రాష్ట్ర కో-ఆపరేటివ్ అధికారులకు సమర్పించారు. దీంతో స్టోర్స్ లో పనిచేసే ఉద్యోగులకు ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వకుండానే తొలగించారు. అందులో 9 మంది కోర్టుకెళ్లి తమ తొలగింపు ఎలాంటి కారణం చూపలేదని కోర్టు ద్వారా మధ్యంతర ఉత్తర్వులను తీసుకొచ్చారు. దీంతో వారిని ఉద్యోగంలో కొనసాగించాలని కోఆపరేటివ్ సొసైటీ ఇన్చార్జి కు హైకోర్టు సూచించింది. దీంతో తొలగించిన తొమ్మిది మంది ఉద్యోగులు కోపరేటివ్ స్టోర్లో ఉద్యోగంలో చేరనున్నారు.



పాత్రికేయ వృత్తి మహోన్నతం..!

ఫెడరేషన్ చిత్తూరు జిల్లా మహాసభలో

ఇన్‌ఛార్జి మంత్రి రాంప్రసాద్‌రెడ్డి



ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్

'ప్రజాస్వామ్య వ్యవస్థలో నాలుగో స్తంభం మీడియా అని, మీడియా వృత్తి మహోన్నతమైనదని, సమాజాన్ని ముందుకు తీసుకెళ్లే మార్గదర్శకులుగా పాత్రికేయులు బాధ్యతతో పనిచేయాలి' అని ఇన్‌ఛార్జి మంత్రి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. చిత్తూరు శాసనసభ్యులు తన సొంత నిధులతో 400 మంది పాత్రికేయులకు హెల్త్ ఇన్స్యూరెన్స్ సంబంధించిన మొత్తం 5 లక్షల 20వేలకు సంబంధించిన మెగా చెక్కును పాత్రికేయులకు సభాముఖంగా అందించారు. ఈ ఏడాది మెరిట్ సాధించిన జర్నలిస్టుల పిల్లలకు రూ.2 లక్షల ఆర్థిక సాయాన్ని తాను అందిస్తానని మంత్రి వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ చిత్తూరు జిల్లా నాలుగో మహాసభ చిత్తూరు జడ్‌పి కార్యాలయంలో మంగళవారం జరిగింది. కలెక్టర్ సుమిత్‌కుమార్, చిత్తూరు, పూతలపట్టు ఎంఎల్‌ఎలు గురజాల జగన్మోహన్, పి.మురళీమోహన్, సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పోటుగాని భాస్కర్, ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.వెంకట్రావు, జనరల్ సెక్రటరీ ఆంజనేయులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు వలిగళం గోపి, రాష్ట్ర నాయకులు జయరాజ్, జిల్లా అధ్యక్షులు బి.ప్రకాష్, ప్రధాన కార్యదర్శి సలీంబాష, ఎపిబిజెఎ జిల్లా అధ్యక్షులు జయచంద్ర, ప్రధాన కార్యదర్శి నీరజాక్షులు, నాయకులు దేవరాజులు, బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు. జిల్లా నలుమూలల నుంచి 500 మంది పాత్రికేయులు పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ మీడియా వృత్తి చాలా మహోన్నతమైనదని, కార్గిల్ లాంటి క్లిష్ట పరిస్థితుల్లోనూ ప్రాణాలను సైతం పణంగా పెట్టి, వాస్తవాలను వెలుగులోకి తెచ్చారన్నారు.



మంత్రి రాంప్రసాద్, ఎంఎల్ఎలు గురజాల, పి.మురళి, ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు



సమాజాన్ని ముందుకు నడిపించడంలో మార్గదర్శకులుగా ఉండాలన్నారు. వార్తలను ప్రచురించే ముందు క్షుణ్ణంగా పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తెచ్చేలా వార్తా ప్రసారాలు ఉంటే ప్రజల్లో విశ్వసనీయత పెరుగుతుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పాత్రికేయులకు గృహ నిర్మాణం, హెల్త్ కార్డులను సమకూరుస్తుందని, మరిన్ని సంక్షేమ కార్యక్రమాలను పాత్రికేయులకు అందించడంలో ముందుంటుందన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ పాత్రికేయులు ఒత్తిడి లేకుండా పూర్తి స్వేచ్ఛతో పని చేయాలన్నారు. చిత్తూరు, పూతలపట్టు ఎంఎల్ఎలు మాట్లాడుతూ పాత్రికేయ వ్యవస్థలో కూటమి ప్రభుత్వం తీసుకొస్తున్న సంస్కరణలు రానున్న రెండు దశాబ్దాల కాలం వరకూ పాత్రికేయులకు రక్షణ కవచంగా పనిచేస్తుందన్నారు. అనంతరం అతిథులలకు మెమెంటోలను అందజేశారు.

సిమెంట్ రోడ్డు ప్రారంభం

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మంగళవారం ఉదయం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం బుచ్చినాయుడు కండ్రిగ మండలం, కారణి మిట్ట వద్ద సిమెంట్ కాంక్రీట్ రోడ్డు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో సీసీ రోడ్లు, పశువుల షెడ్లు, తాగునీటి తొట్లెలు నిర్మాణం జరుగుతున్నాయన్నారు. వీటితో పాటు స్మశానాల అభివృద్ధికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు.

త్రిపుర గవర్నర్ దంపతులకు ఎమ్మెల్యే స్వాగతం

వెస్ట్ వరత్తూరుకు విచ్చేసిన త్రిపుర గవర్నర్ ఇంద్రసేనా రెడ్డి దంపతులకు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో బుచ్చినాయుడు కండ్రిగ మండలానికి చెందిన అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఒలంపియాడ్‌లో శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, సనత్ నగర్, శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఐ.ఎన్.టి.ఎస్.ఓ సెకండ్ లెవెల్ ఒలంపియాడ్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచి, బహుమతులు సాధించిన విద్యార్థులకు పాఠశాల ప్రాంగణంలో మంగళవారం అభినందన సభ నిర్వహించారు. ఆరవ తరగతి చదువుతున్న శ్రేష్ట రెడ్డి ప్రథమ బహుమతి లాప్ టాప్ సాధించగా, మూడవ తరగతి చదువుతున్న తుథిశ్రీ, ఏడవ తరగతి చదువుతున్న నందకిషోర్ రెడ్డి ద్వితీయ బహుమతులుగా ట్యాబ్‌లు సాధించారు. 162 మంది విద్యార్థులు గోల్డ్ మెడల్, మెరిట్ సర్టిఫికేట్లను, 62 మంది విద్యార్థులు కన్సోలేషన్ బహుమతులు పొందారు. ఈ బహుమతులను మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, పాఠశాల ఏజీఎం ఎన్.శ్రీకాంత్ చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డీన్లు శ్రీహరిబాబు, హరి బ్రహ్మ యాదవ్, గాంధీ, ఒలంపియాడ్ ఇంచార్జిలు మల్లి సింగ్, సాయి చందన, ప్రైమరీ ఇంచార్జ్ చందన, ప్రీ ప్రైమరీ ఇంచార్జ్ కిరణ్మయి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రింటర్ వితరణ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : పడమర గూడూరు, జి.ఎస్.రాయలు మున్సిపల్ హైస్కూల్‌కు రోటరీ సభ్యులు, పూర్వ విద్యార్థులైన బాలకృష్ణంరాజు, ఆర్.వి.సుబ్రహ్మణ్యం, వారి స్నేహితులు మల్లికార్జున్, మహీధర రెడ్డి రోటరీ క్లబ్ ద్వారా ప్రింటర్‌ను బహూకరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ రోటేరియన్ దశరథరామిరెడ్డి, రత్నం, మల్లు విజయకుమార్ రెడ్డి, సురేష్ రెడ్డి, రాంప్రసాద్, బలరాం రెడ్డి, ఇంచార్జి ప్రధానోపాధ్యాయురాలు మృదుల, అధ్యాపకులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు బాలికల ఉన్నత పాఠశాలలో ధరిత్రీ దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన సీనియర్ రొటేరియన్స్ శ్రీకంటి రామ్మోహనరావు, ఎల్లసిరి గోపాలరెడ్డిలు క్రీడా పోటీల్లో రాష్ట్ర, జాతీయస్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించి, నగదు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఇఓ సనత్ కుమార్, బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మాధవి లక్ష్మి, భారతి, పిడి విజయలక్ష్మి, శివప్రసాద్‌లు పాల్గొన్నారు.

హైబ్రిడ్ బైక్ ఆవిష్కరణ



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, యమహా షోరూం 8వ వార్షికోత్సవం సందర్భంగా ఎఫ్‌జెడ్ఎస్ఎఫ్ఐ హైబ్రిడ్ నూతన బైక్ లాంచింగ్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రగతి సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ చేతుల మీదుగా బైక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ శ్రీ విష్ణు యమహా మోటార్స్ 8వ వార్షికోత్సవం పురస్కరించుకొని స్పెషల్ ఫీచర్ పొల్యూషన్ ఫ్రీ బైక్‌ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం సంతోషకరమన్నారు. అనంతరం యమహా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ హైబ్రిడ్ బైక్ టెక్నాలజీ యమహా ఫెసినో 125, రేజెడిఆర్ 125 లాగే ఉంటుందని పవర్, పికప్ విషయంలో రాజీ పడకుండా మంచి మైలేజ్ ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో షోరూం సిబ్బంది, ప్రగతి కుటుంబ సభ్యులు, స్నేహితులు తదితరులు పాల్గొన్నారు.

లో వోల్టేజ్ నుండి విముక్తి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని స్థానిక మున్సిపాలిటీ 19 వ వార్డు, బీడీ కాలనీ ప్రజలు గత ఐదు సంవత్సరాల నుండి విద్యుత్ లోవోల్టేజ్ కారణంగా ఇబ్బంది పడుతున్నారు. తమ సమస్యను టీడీపీ పట్టణ అధ్యక్షులు గాలి జీవ రత్నం నాయుడుకు తెలియజేయగా, ఆయన ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ దృష్టికి తీసుకుని వెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే విద్యుత్ శాఖ ఏఈ జయసాయితో మాట్లాడి నూతన డిటిఆర్ (ట్రాన్స్ఫార్మర్) ఏర్పాటు చేసి విద్యుత్ లోవోల్టేజ్ సమస్యను పరిష్కరించేలా చేశారు. ఈ కార్యక్రమంలో లైన్మెన్ దేవా, ఏఎల్ఎం సురేష్, కాంట్రాక్టర్ రామ్మూర్తి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల బదిలీ ఆపాలి



ఎమ్మెల్యే భాను ప్రకాష్‌కు వినతి సమర్పించిన గ్రామస్తులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పడమాల పేట మండలం, రామసముద్రంలో గత 40 సంవత్సరాలుగా ఉన్న ప్రాథమిక పాఠశాలను, వడమాల పేటకు బదిలీ చేసేందుకు విద్యాశాఖ అధికారులు సన్నాహాలు చేపట్టారు. రామసముద్రం గ్రామ ప్రజలు నగరి నియోజకవర్గ శాసనసభ్యులు గాలి భాను ప్రకాష్‌ను కలిసి పాఠశాల విలీనం ఆపాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో చర్చించి పాఠశాల బదిలీ ఆపేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, అధికార ప్రతినిధి ధనంజయులు నాయుడు, పూల ప్రవీణ్, కృష్ణ షబ్బీర్, చైతన్య స్కూల్ పిల్లలు, తల్లితండ్రులు గ్రామ ప్రజలు, నాగమణి, మమతా, హేమ, శీను రెడ్డి, బబ్లు పాల్గొన్నారు.

పోషణ్ పక్వాడ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, విందూరు గిరిజన కాలనీ, అంగన్వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సి.డి.పి.వో మెహబూబి పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ పరిశుభ్రత పాటిస్తూ, పోషకాహారం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ హైమావతి, జడ్పీహెచ్ స్కూల్ టీచర్స్ ప్రవీణ్ సురేష్, అంగన్వాడి టీచర్ కోటేశ్వరి, స్వర్ణ లత, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి -కోట : కోట మండలం, జరుగుమల్లి పంచాయతీ అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం కోట, వాకాడు, చిట్టమూరు గ్రామాలలో పోషణ్ పక్వాడ కార్యక్రమం జరిగింది. ఐసీడీఎస్ సిడిపిఓ మునికుమారి, ఐసీడీఎస్ సూపర్వైజర్‌లు పాల్గొన్నారు.



వృక్షో రక్షతి.. రక్షిత:

- విద్యుత్ శాఖ సిబ్బంది అత్యుత్సాహం
- పరిమితికి మించి చెట్ల నరికివేతపై ప్రజాగ్రహం

ధరిత్రీ దినోత్సవం రోజున మంగళంలో చెట్లు నరుకుడు కార్యక్రమం..!



నేడు ప్రపంచ ధరిత్రీ దినోత్సవం.. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ సిబ్బంది మంగళం, జయశంకర్ కాలనీవాసులకు వేసవి బహుమతి అందించారు. విద్యుత్ లైన్లకు తగిలే చెట్ల కొమ్మలను మాత్రమే తొలగించకుండా.. ఉత్సాహంగా చెట్లకు చెట్లనే నరికేశారు. అవసరమైనా, లేకున్నా కొన్నచోట్ల చెట్లపై దాడి చేశారు. ఒక వైపు వృక్షో రక్షతి రక్షిత: అంటుంటే ఈ చర్యలేంటని స్థానికులు ముక్కున వేలేసుకున్నారు. చెట్లను పెంచుదాం.. భూమిని కాపాడు కుందాం వంటి నినాదాలను తోసిరాజని నరుకుడు కార్యోన్ముఖులు కావడం పలువురిని విశ్మయానికి గురిచేసింది.

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం): విద్యుత్ శాఖ సిబ్బంది అత్యుత్సాహంతో పరిమితికి మించి చెట్లు నరకడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంగళం పరిధిలో విద్యుత్ శాఖ అధికారులు గత కొన్ని రోజులుగా విద్యుత్తు అంతరాయం లేకుండా చూసేందుకు విద్యుత్తు లైనులకు చెట్ల కొమ్మలు తగిలే చోట్ల, చెట్లను తొలగిస్తూ వస్తున్నారు. అయితే ఈ క్రమంలో విద్యుత్ శాఖకు సూచన మేరకు తొలగింపు ప్రక్రియ జరగడం లేదని తెలుస్తోంది. మంగళవారం జయశంకర్ కాలనీలో విద్యుత్ శాఖ సిబ్బంది నిబంధనలు పక్కనపెట్టి ఇష్టానుసారం చెట్ల కొమ్మలను నరికివేశారు. కొన్నిచోట్ల తొలగించాల్సిన కొమ్మలను విడిచిపెట్టడం జరిగింది. రోజు రోజుకి పెరిగిపోతున్న ఉష్ణోగ్రతలతో ప్రజలు ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు విద్యుత్ సరఫరా కూడా అంతంత మాత్రంగానే ఉంది. ఎండ వేడిమిని నుండి ఉపశమనం కోసం వృద్ధులు చెట్లు కింద సేద తీరుతుంటారు. విద్యుత్ శాఖ సిబ్బంది అత్యుత్సాహంతో ఇష్టానుసారం కొమ్మలను నరకడంతో ప్రజలు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఉక్కపోతలతో అల్లాడుతుంటే పచ్చని చెట్లను ఇలా ఇష్టానుసారం నరికి వేయడం ఏంటని సిబ్బందిని ప్రశ్నించారు.

వాస్తవానికి.. విద్యుత్ శాఖ అంతరాయం లేని విద్యుత్ సరఫరాను అందించడానికి వీధులలో పెంచిన చెట్లను విద్యుతులైన్లకు తగలకుండా విద్యుత్ శాఖ మెయిన్‌టనెన్స్ ద్వారా చెట్ల కొమ్మలను నరికి వేయడం జరుగుతుంది. అయితే చెట్లు నాటే బాధ్యత విద్యుత్ శాఖకు లేదు కనుక, ఆయా సబ్ డివిజన్లో పచ్చదనాన్ని పెంపొందించడానికి చెట్లను నాటాల్సి ఉంటుంది. విద్యుత్తు లైన్లకు తగిలే కొమ్మలను మాత్రమే తొలగించాల్సి ఉంది. కానీ జయశంకర్ కాలనీలో చెట్టులో అర్థ భాగాన్ని తొలగించారు. ఇది నిబంధనలకు విరుద్ధంగా ఉందని తెలుస్తోంది.

విచారణ చేస్తాం..

మంగళం జయశంకర్ కాలనీలో ఇష్టానుసారంగా చెట్లు నరికివేతపై సిబ్బంది నుండి వివరణ తీసుకుంటాం. నిబంధనల మేరకు విద్యుత్తు లైనులకు తగిలే చెట్లు కొమ్మలను మాత్రమే తొలగిస్తున్నాం.

-మోహన్, ఏఈ, మంగళం సబ్ స్టేషన్

ఘనంగా కాంట్రాక్టర్ ప్రసాద్ జన్మదిన వేడుకలు



అన్నదానం చేస్తున్న ప్రసాద్, చిన్ని

ప్రజాశక్తి-తిరుపతి (మంగళం): తిరుమలకు చెందిన ప్రసాద్ జన్మదిన వేడుకలను జీవకోనకు చెందిన కాంట్రాక్టర్ పెంచలయ్య (చిన్ని) ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా జరిగాయి. తిరుపతి రుయా ఆసుపత్రి వద్ద వెయ్యి మంది పేదలకు అన్నదానంతో పాటు, పలు అనాధాశ్రమాలలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ జన్మదిన వేడుకల్లో లోకనాథం, కృష్ణయ్య, గుర్రప్ప, ప్రసాద్, సుప్రీత్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ఆరోపణలు

ప్రజాశక్తి - రామ చంద్రాపురం: ఎమ్మెల్యే పులివర్తి నాని చంద్రగిరి నియోజక వర్గంలో చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక తప్పుడు ఆరోపణలు చేయడం మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డికి, వైసీపీ నాయకులకు తగదని మండల టీడీపీ అధ్యక్షుడు మేకల తిరుమలరెడ్డి, టీడీపీ నాయకులు హితవు పలికారు. మంగళవారం మండల కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులతో కలిసి ఆయన మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయంలో అవినీతి రాజ్యమేలిందన్నారు. చెవిరెడ్డి నీకు దమ్ముంటే ఎమ్మెల్యే నానిపై చేస్తున్న అవినీతి ఆరోపణలను నిరూపించాలన్నారు కాణిపాకంలో ప్రమాణానికి మేము సిద్ధంగా ఉన్నామని మీరు సిద్ధమేనా అని చెవిరెడ్డికి సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు నరసింహారెడ్డి, కోరా హరిప్రసాద్ , ముని రామిరెడ్డి, కొట్టే గిరిధర్ రెడ్డి, తాటి రెడ్డి వెంకటేష్ రెడ్డి, ముద్దుకృష్ణారెడ్డి, బండారు ధనంజయలు, మోహన్ రెడ్డి, బాల ప్రసాద్ పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి 'ప్యూర్ గ్లో' విడుదల



ప్రజాశక్తి - తిరుపతి సిటీ : ఇమామి లిమిటెడ్, ఇమామి గ్రూప్ ఆధ్వర్యంలో మగువల చర్మ రక్షణ కోసం తయారు చేసిన ఇమామీ ప్యూర్ గ్లోను ప్రముఖ నటి రాశి ఖన్నా మార్కెట్లోకి విడుదల చేసింది. ఈ సందర్భంగా ఆ సంస్థ వైస్ చైర్మన్ మోహన్ గోయాంకా మాట్లాడుతూ ప్యూర్ గ్లో సరిక్రొత్త మాయిశ్చరైజింగ్ బేస్ ఫార్ములా – ఏ విధమైన తెల్ల మచ్చలు ఉండవని, ఫాస్ట్ అబ్జార్షన్‌తో ఎక్కువ సమయం నిలిచి ఉంటుందని తెలిపారు. హైడ్రేషన్, జపానీ సకురా పూలు, నియాసినమైడ్, సుగుణాలతో నిండినదన్నారు. ఎండ నుండి రక్షణకు, ఎక్కువ సమయం వరకు సమర్థవంతమైనదని తెలిపారు. మెరుపు కోసం పింక్, ఆకర్షణీయమైన రూపం కోసం గోల్డ్ అందుబాటులో ఉన్నాయన్నారు. "ఇమామి సంవత్సరాలుగా తమ ఆధునిక, అత్యంత ప్రభావవంతమైన ప్రోడక్ట్స్ తో పర్సనల్ కేర్ కేటగిరీలో క్రొత్త క్రొత్త ఉత్పత్తులను అందిస్తున్నామన్నారు. కస్టమర్లకు కావల్సిన విధంగా 6– విధాల బ్రైటెనింగ్ యాక్షన్, డీప్ పెనెట్రేషన్ టెక్నాలజీ, ప్రకృతి పరమైన మూల పదార్థాలతో తయారైన ఈ ఉత్పత్తి సమర్థవంతంగా, ఎక్కువ సమయం వరకు మెరుపు నిలకడగా ఉంచుతుందని తెలిపారు. ఇమామి ప్యూర్ గ్లో 8 గ్రాములు, 15 గ్రాములు, 25 గ్రాములు, 50 గ్రాముల ప్యాక్ సైజులలో క్రమంగా సంబంధిత ధర రూ.10, 25, 65, 125 లలో లభ్యమవుతాయని తెలిపారు. వీటిని మహిళలు అధికంగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు ఆధునీకరించిన 'స్పోర్ట్స్ కాంప్లెక్స్' ప్రారంభం

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతిలోని క్రీడాకారులకు అత్యుత్తమ క్రీడాసౌకర్యాలను కల్పించాలనే ఉద్దేశంతో ఎస్వీ ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలోని శ్రీశ్రీనివాసా స్పోర్ట్స్ కాంప్లెక్సును శాప్ ఆధ్వర్యంలో అత్యాధునికరించినట్లు శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. స్పోర్ట్స్ కాంప్లెక్స్ అత్యాధునికీకరణ పనులను రాష్ట్ర క్రీడాశాఖామంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్, ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు బుధవారం ప్రారంభించనున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో కాంప్లెక్సులోని మల్టీపర్పస్ స్పోర్ట్స్ ఎరీనా, ఎన్టీఆర్ క్రీడావికాస కేంద్రం, రైఫిల్ షూటింగ్, స్విమ్మింగ్ పూల్, మేజర్ ధ్యాన్ చంద్ విగ్రహం, అత్యాధునిక లైటింగ్ పనులను శాప్ ఛైర్మన్ మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తిరుపతిలో ఏడు యూనివర్సిటీల నుంచి అధిక సంఖ్యలో వివిధ స్థాయిల్లో క్రీడాకారులు రాణిస్తున్నారన్నారు. వారికి ప్రయోజనకరంగా స్పోర్ట్స్ కాంప్లెక్స్ ను అభివద్ధి చేసి మెరుగైన క్రీడా వసతులు నెలకొల్పడం జరిగిందన్నారు. తిరుపతిని స్పోర్ట్స్ హబ్ గా తీర్చిదిద్దడమే ధ్యేయమని, శ్రీశ్రీనివాసా స్పోర్ట్స్ కాంప్లెక్స్ అత్యాధునికీకరణతో తిరుపతిలోని క్రీడాకారులందరికీ మేలు చేకూరుతుందని అన్నారు.

'ఎంబియు'కు జాతీయ స్టార్ రేటింగ్

ప్రజాశక్తి -తిరుపతి సిటీ : భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖకు చెందిన ఇన్స్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్ (ఐఐసి) నుంచి మోహన్ బాబు విశ్వవిద్యాలయం (ఎంబియు) ఆకట్టుకునే 3.5–స్టార్ రేటింగ్‌ను పొందిందని వర్సిటీ ఛాన్సలర్ మంచు మోహన్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గుర్తింపు దేశవ్యాప్తంగా ఈ ర్యాంకింగ్స్ కోసం పాల్గొన్న 481 విశ్వవిద్యాలయాలలో ఆవిష్కరణ, వ్యవస్థాపకత, స్టార్టప్ సంస్కృతిని పెంపొందించడంలో అసాధారణమైన నైపుణ్యాన్ని ప్రదర్శించిన కేవలం 39 అత్యున్నత విశ్వ విద్యాలయాల సరసన ఎంబియుని చేర్చింది. ఇక్కడ గమనించవలసినది ఏమిటంటే, ఏ విశ్వవిద్యాలయం కూడా గరిష్టంగా 4.5–స్టార్ స్థాయిని సాధించలేదు. ఆవిష్కరణ కార్యకలాపాలు, పరిశ్రమ సహకారాలు, స్టార్టప్ మద్దతు, జాతీయ హ్యాకథాన్‌లలో పాల్గొనడం, ఇంక్యుబేషన్ సౌకర్యాల ఏర్పాటు వంటి ప్రమాణాలపై విశ్వవిద్యాలయాలను అంచనా వేయడానికి జాతీయంగా గుర్తింపు పొందిన ప్రమాణంగా ఐఐసి రేటింగ్ నిలుస్తోంది.

సాగు భూములకు పట్టాలు ఇవ్వండి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : రైతులు సాగు భూములకు పట్టాలు ఇవ్వాలని గూడూరు డివిజన్ రైతు సంఘం నాయకులు జోగి శివ కుమార్ డిమాండ్ చేశారు. గూడూరు మండలం పరిధి, కాంద్ర గ్రామంలో గత 30 సంవత్సరాలుగా హరిజనులు, గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములను రెగ్యులేషన్ చేసి పట్టాలు ఇవ్వాలని కోరారు. ఎమ్మార్వో, ఆర్డీవో, జిల్లా కలెక్టర్లకు ఎన్నిసార్లు వినతులు సమర్పించినా ప్రయోజనం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సి.పి.ఎం నాయకులు బి.వి.రమణయ్య, బి.నారాయణ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అరుదైన మూలకాల సద్వినియోగంలో చైనాను అధిగమించాలి

ప్రజాశక్తి - క్యాంపస్ : అరుదైన మూలకాలను సద్వినియోగం చేసుకోవడంలో చైనాను మన దేశం అధిగమించవలసి ఉందని హైదరాబాదులోని నేషనల్ జియో లాజికల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ (ఎన్ జి ఆర్ ఐ) ముఖ్య శాస్త్రవేత్త డాక్టర్ వైశెట్టి బలరాం పేర్కొన్నారు. ఎస్ వి యూ ఫిజిక్స్ – పద్మావతి వర్సిటీ బయోటెక్నాలజీ విభాగాలు సంయుక్తంగా సైన్స్, టెక్నాలజీ అండ్ అప్లికేషన్స్ ఆఫ్ రేర్ ఎర్త్స్ అంశంపై రెండవ రోజు కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో రేర్ ఎర్త్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు డాక్టర్ దీపేంద్ర సింగ్, కార్యదర్శి డాక్టర్ ఎమ్మెల్వీ రెడ్డి, ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ సికే జయశంకర్ అధ్యాపకులు, విద్యార్థులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రపంచ ధరిత్రి దినోత్సవం

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, యువజన సర్వీసుల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారి సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ ధరిత్రి దినోత్సవం విశ్వవిద్యాలయంలోని 'డైరెక్టరేట్ ఆఫ్ స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్' విభాగంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ భూమి నుంచే నీరు, గాలి, ఆహారం అందుతుందని, కనుక భూమి విశిష్టతను గుర్తించి కాపాడుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫార్మసి కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఓవిఎస్ రెడ్డి, కల్చరల్ కోఆర్డినేటర్ డాక్టర్ వివేక్, పరిశోధకులు, విద్యార్థిని, విద్యార్థులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రగిరిలో..

ప్రజాశక్తి - రామచంద్రపురం: స్వమాక్స్ (స్వర్ణముఖి మహిళా పరస్పర సహకార సంఘం లి.) వారి ఆధ్వర్యంలో మంగళవారం చంద్రగిరి స్వమాక్స్ కార్యాలయంలో ప్రపంచ ధరిత్రి దినోత్సవం జరిగింది. ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని ఉద్దేశించి స్వమాక్స్ సిఈఓ సంగీతం విశ్వనాథ్ మాట్లాడుతూ సకల జీవరాశికి ఆధారమైన భూమి ఎన్నో విధాలుగా కలుషితమవుతోందన్నారు. ప్లాస్టిక్ ఉత్పత్తుల వినియోగంతో భూ పర్యావరణానికి చాలా ప్రమాదమన్నారు. ప్లాస్టిక్ రహిత జీవనానికి, రసాయన ఎరువులు లేని వ్యవసాయానికి పట్టం కట్టాలన్నారు. విరివిగా మొక్కలు నాటి భూమిని, పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్వమాక్స్ సిబ్బంది సుబ్రహ్మణ్యం, ప్రశాంత్, వినోద్, యశోద, కౌసల్య, మరియు సీ.ఈ.ఓ విశ్వనాథ్, మహిళా సభ్యురాలు పాల్గొన్నారు.

మహిళా వర్సిటీలో..

ప్రజాశక్తి – క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, సైన్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, సంయుక్త ఆధ్వర్యంలో ధరిత్రీ దినోత్సవం నిర్వహించారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో చెట్లు నాటి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విసి ప్రొఫెసర్ ఉమా మాట్లాడుతూ ప్రకృతిని కాపాడుదాం భూమికి పునర్జీవం ఇవ్వమని పిలుపునిచ్చారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన టిటిడి అడిషనల్ ఈవో వెంకయ్య చౌదరి మాట్లాడుతూ ప్రకృతిలో జీవ రాశులన్నీ భూమిపై ప్రత్యక్షంగా పరోక్షంగా ఆధారపడి ఉన్నాయని చెప్పారు. అటువంటి భూమిని కాపాడవలసిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉందని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ ఆర్.రామమూర్తి మూర్తి, ప్రెసిడెంట్, దోసైటీ ఫర్ హ్యూమన్ రైట్స్ అండ్ సోషల్ డెవలప్మెంట్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్. ఎన్.రజని, దామోదరం నాయుడు పి. మార్కండేయులు రెడ్డి, విజయ్ కుమార్ నాయుడు, ప్రొఫెసర్. ఆర్.ఉష. కన్వీనర్ ఆర్ ఎస్ డి డైరెక్టర్ ,టీం సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతు విభాగ చైర్మన్‌గా మణి రాజు ఎన్నిక



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వడమాలపేట మండలం, ఎస్‌బిఆర్ పురం గ్రామ పంచాయతీకి రైతు విభాగం అధ్యక్షుడిగా ఆర్.మణి రాజును గ్రామ రైతులు ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడుగా భవాని ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా టీ.వి.రాకేష్‌లను ఎన్నుకున్నారు. ఫార్మర్స్ సొసైటీ సభ్యులకు అడ్వకేట్ దిలీప్ రెడ్డి ధ్రువీకరణ పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ఆర్.సుబ్రహ్మణ్యం రాజు, మాధవరాజు, రామచంద్ర రాజు, సుధాకర్, హరి బాబు, చంద్రశేఖర్ రాజు, ఎమ్.శేఖర్ రాజు, పి.సురేష్, సుబ్రహ్మణ్యం రాజు, యాయతి, మనోహర్, సుమన్, తదితరులు పాల్గొన్నారు.

మహిళాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం : పులివర్తి సుధారెడ్డి

ప్రజాశక్తి - రామచంద్రపురం: మహిళల సంక్షేమమే అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తున్నదని చంద్రగిరి నియోజకవర్గ టిడిపి మహిళా నేత పులివర్తి సుధా రెడ్డి అన్నారు. మంగళవారం తొండవాడలో మహిళలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా పులివర్తి సుధా రెడ్డి మాట్లాడుతూ స్వయం ఉపాధి శిక్షణ పొందడంతో మహిళలు స్వతంత్రంగా సంపాదిస్తూ, గౌరవంగా జీవించేందుకు సహాయపడతాయని తెలిపారు. టీడీపీ మండల బీసీ సెల్ అధ్యక్షుడు మణి యాదవ్ మేనల్లుడు తన్విక్ యాదవ్‌కు సుధా రెడ్డి సైకిల్ కొనిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గిరిధర్ రెడ్డి, కుమార్ రాజా రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షులు ఉమాపతి రెడ్డి, పులికంటి మోహన్ రెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ కాలం జగన్మోహన్ నాయుడు, బిసి మండల పార్టీ అధ్యక్షుడు మనీ యాదవ్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పరీక్షలా..? జన్మదిన వేడుకలా..?

ప్రజాశక్తి - క్యాంపస్ : విద్యార్థులకు పరీక్షలు నిర్వహించడం ముఖ్యమా ... ? రాజకీయ నాయకుల పుట్టినరోజు వేడుకలు నిర్వహించడం ముఖ్యమా....? అని పూజారి రాఘవేంద్ర వర్సిటీ అధికారులను నిలదీశారు. ఎబివిపి ఆధ్వర్యంలో యస్వీయు పరిపాలన భవనం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. రాఘవేంద్ర మాట్లాడుతూ ఈరోజు జరగాల్సిన డిగ్రీ 2,4 వ సెమిస్టర్ పరీక్షలు కేవలం హాల్ టికెట్ రాలేదని వాయిదా వెయ్యడం సిగ్గుచేటన్నారు. డిగ్రీ విద్యార్థులు అనేక సమస్యలతో సతమతమవుతుంటే యూనివర్సిటీ అధికారులు రాజకీయ నాయకుల పుట్టినరోజు వేడుకల్లో పాల్గొనడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సురేంద్ర, నగర కార్యదర్శి నందకిషోర్, బాలు నాయక్,తేజ, విద్యార్థులు పాల్గొన్నారు.

సంస్కృత జ్ఞానం.. ఏఐ టెక్నాలజీతో మార్పు

ప్రజాశక్తి - క్యాంపస్ : సంస్కృత జ్ఞానాన్ని ఆధునిక తరానికి ఏఐ టెక్నాలజీ మార్పు ద్వారా నూతన ఒరవడిని సృష్టించవచ్చునని వక్తలు పేర్కొన్నారు. జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం, సి–డాక్ సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజులపాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్, క్వాంటం కంప్యూటింగ్ అండ్ ఇండియన్ నాలెడ్జ్ సిస్టం పైన జాతీయ సదస్సు విశ్వవిద్యాలయంలోని ప్రముఖ రమారంజన్ ముఖర్జీ ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించారు. ఈ సదస్సులో వక్తలు మాట్లాడుతూ ఏఐ టెక్నాలజీతో సంస్కృత భాషలోని వేదాల, ఉపనిషత్తుల, సారాంశం నేటి తరానికి అందించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ ప్రొ.కె.గణపతి భట్, ప్రొ.ఆర్.జె.రమాశ్రీ, అకాడమిక్ డీన్ ప్రొ.రజనీకాంత్ శుక్ల, ప్రొ.బి.కృష్ణ ప్రపూర్ణ, డా.కాళిదాసు, ప్రొ.బి. చంద్రశేఖరం, అధ్యాపకులు ప్రొ.శ్రీధర్, డా.మేరీ సుజాత, డా.జి.నాగలక్ష్మి,జి.ప్రసన్న, కె.సంకీర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిశోధనా ఫలితాలు రైతులకు అందాలి

ప్రజాశక్తి - క్యాంపస్ : క్షేత్రస్థాయిలో పరిశోధనా ఫలితాలను త్వరితగతిన అందించడం, వ్యవసాయ పరిశోధన సంస్థలు, వ్యవసాయ విశ్వవిద్యాలయాల మధ్య సమన్వయం, సహకారం ద్వారా వికసిత్ భారత్ 2047 లక్ష్యాలను అధికమించడానికి వీలవుతుందని భారత వ్యవసాయ పరిశోధనా మండలి డిప్యూటీ డైరెక్టర్ జనరల్ వ్యవసాయ విస్తరణ డాక్టర్ రాజబీర్ సింగ్ తెలిపారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాలలో 8వ పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థుల జాతీయ సదస్సు మంగళవారం నిర్వహించారు.

క్రైం న్యూస్

ట్రాక్టర్, కారు ఢీ.. ఇరువురికి గాయాలు



దెబ్బతిన్న ట్రాక్టర్, కారు, గాయాలపాలైన కారు నడుపుతున్న కృష్ణచంద్

ప్రజాశక్తి -దొరవారిసత్రం : దొరవారిసత్రం మండల పరిధిలోని కలకత్తా– చెన్నై జాతీయ రహదారి టపాఇండ్ల సమీపంలో ట్రాక్టర్‌ను కారు ఢీకొన్న ప్రమాదం మంగళవారం జరిగింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ గురవయ్యకు, కారు నడుపుతున్న యజమాని కృష్ణ చంద్‌కు (58) తీవ్ర గాయాలయ్యాయి. వీరిని వైద్య సేవల నిమిత్తం సూళ్లూరుపేట సామాజిక వైద్యశాలకు స్వర్ణ టోల్ ప్లాజా అంబులెన్స్ వాహనంలో తరలించారు. వివరాల్లోకి వెళితే.. దొరవారిసత్రం వైపు నుండి ఇసుకలోడుతో ట్రాక్టర్ సూళ్లూరుపేట వైపు వెళుతూ వాహనాన్ని పక్కకు తీసే క్రమంలో, విజయవాడ నుండి చెన్నై వెళున్న కారు వేగంగా ఢీకొనింది. దీంతో ట్రాక్టర్ ఇంజన్ అదుపు తప్పు పడిపోయింది. కారు ముందు భాగం నుజ్జు నుజ్జయింది. కారు నడుపుతున్న కృష్ణచంద్ గాయాలకు గురై డ్రైవింగ్ సీటులో ఇరుక్కుని బయటకు రాలేకపోయాడు. స్థానికులు అడ్డంకులు తొలగించి అతన్ని బయటకు తీశారు. వెనుక సీట్లో ఉన్న అతని భార్య పల్లవికి చిన్నపాటి గాయాలయ్యాయి. కారులో వెళ్తున్న దంపతులు విజయవాడ వాసులని సమాచారం. వీరు తమ కుమార్తెను తీసుకురావడానికి చెన్నై ఎయిర్ పోర్టుకు వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. విషయం తెలుసుకున్న దొరవారిసత్రం ఎస్సై అజయ్ కుమార్ క్షతగాత్రులను పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధి హామీ కార్యాలయంలో ఘర్షణ

- ఫీల్డ్ అసిస్టెంట్ తలపై బలమైన గాయం



ప్రజాశక్తి - తిరుపతి డెస్క్: పెళ్ళకూరు ఉపాధి హామీ కార్యాలయంలో మంగళవారం పునబాక ఫీల్డ్ అసిస్టెంట్‌కు ఏపీఓకు మధ్య వివాదం చోటు చేసుకుంది. ప్రతి బుధవారం అందరూ ఫీల్డ్ అసిస్టెంట్లు ఒక దగ్గర చేరి మస్టర్లు రెడీ చేసుకుని సంతకాలు తీసుకుని వెళ్లడం వారి కార్యక్రమంలో భాగం, కానీ మంగళవారం పునబాక ఫీల్డ్ అసిస్టెంట్ ఏపీఓ దగ్గరకు వెళ్లి మాస్టర్‌లో సంతకాలు పెట్టాలని కోరగా, ఏపీవో తిరస్కరించడం జరిగింది. నేను పెట్టనంటే పెట్టను అంటే.. ఏపీవో పెట్టి తీరాల్సిందే అంటూ వారి మధ్య వాదోపవాదాలు ఘర్షణగా మారాయి. దగ్గరలో ఉన్న స్టీల్ క్యారేజీతో ఏపీవో దాడి చేయగా, ఫీల్డ్ అసిస్టెంట్ తలకు తీవ్ర గాయంతో రక్తస్రావం జరిగింది. పక్కనే ఉన్న సిబ్బంది గాయపడిన వ్యక్తిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. ఇది ఇలా ఉండగా ఏప్రిల్ నెలాఖరుకు ఏపీవో రిటైర్ కానున్నారు. ఈలోగా ఇలా జరగడం విచారకరమని తోటి సిబ్బంది పేర్కొన్నారు. ఈ విషయమై సిఐటియు నాయకులు ముకుంద, పుట్టయ్యలు ఏదైనా విషయం ఉంటే మాట్లాడి పరిష్కరించుకోవాలి తప్ప ఇలా వ్యవహరించడం తగదని బాధితులకు క్షమాపణ చెప్పి సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు.

అదనపు పని దినాలు కల్పిస్తాం

- విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మెన్ సుబ్బారెడ్డి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : ఏపీ సీడ్స్ పరిధిలో పనిచేసే హమాలీలకు అదనపు పని దినాలు కల్పిస్తామని విత్తనాభివృద్ధి సంస్థ రాష్ట్ర చైర్మన్ మన్నే సుబ్బారెడ్డి హామీ ఇచ్చారు. మంగళవారం ఆయన స్థానిక ఏపీ సీడ్స్ కార్యాలయాన్ని సందర్శించారు. సంస్థ స్థితిగతులను ఆరా తీశారు. రైతులకు సకాలంలో నాణ్యమైన విత్తనాలు అందించాలని సూచించారు. హమాలీల అభ్యర్థన మేరకు అదనపు పని దినాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కార్మిక సంఘం నాయకులు నాంబాకు ఈశ్వర్ రెడ్డి, పరుకూరు మునెయ్య, గురవయ్య, మోహన్ రెడ్డి, బీజేపీ నాయకులు సుబ్రహ్మణ్యం రెడ్డి, టీడీపీ నేత రంగినేని చెంచయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అపుస్మా స్టేట్ జాయింట్ సెక్రటరీకి సన్మానం



ప్రజాశక్తి - క్యాంపస్ : అప్పుస్మా స్టేట్ జాయింట్ సెక్రటరీ డీజీ రఘును రాయలసీమ జోనల్ ప్రెసిడెంట్ డాక్టర్ విశ్వనాధరెడ్డి, డాక్టర్ రామకృష్ణారెడ్డి, డాక్టర్ వెంకటేశ్వర్లు తదితర ప్రముఖులు మంగళవారం ఘనంగా సన్మానించారు. స్థానిక కేటి రోడ్ విశ్వం స్కూల్‌లో జరిగిన జనరల్ బాడీ మీటింగ్‌లో ఆంధ్ర ప్రదేశ్ అన్–ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ (అప్పుస్మా) ఆధ్వర్యంలో తిరుపతి నుండి విస్‌డమ్ హైస్కూల్ అధినేత ఎంపిక కావడం సంతోషమన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి సిటీ యూనియన్ నాయకులు సంగరాజు భాస్కరరాజు, ఓంప్రకాష్, సుబ్రహ్మణ్యం రెడ్డి, శ్రీధర్ రెడ్డి, ఎస్.ఎం.భాష, భాస్కరరాజు, డిస్టిక్ నాయకులు రవీంద్రనాథ్ రెడ్డి, గీతం విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

రేపు సాధారణ సర్వ సభ్య సమావేశం

ప్రజాశక్తి - గూడూరు టౌన్: గూడూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సాధారణ సర్వ సభ్య సమావేశం గురువారం నిర్వహిస్తున్నట్లు గూడూరు ఎంపిడివో మధుసూదన్ రావు బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి మండల ప్రజా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, కో–ఆప్షన్ సభ్యులు, జిల్లా ప్రాదేశిక వర్గ సభ్యులు, అన్ని శాఖల అధికారులు హాజరవుతారని తెలిపారు.